క్లుప్తంగా

పాలకవీడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా దయాకర్



పాలకవీడు : పాలకవీడు ఎంపీడీఓ వెంకటాచారిని పెన్‌పహాడ్ మండలానికి బదిలీ చేస్తూ జెడ్పీ సీఈఓ జి.సురేష్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే కార్యాలయంలో ఎంపీఓగా పనిచేస్తున్న దయాకర్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

లారీడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న లారీ డ్రైవర్లు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ లతీఫ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన పలువురు లారీ డ్రైవర్లు విరాళాలుగా సేకరించిన రూ.26 వేలను మృతుడి కుటుంబానికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహా సిమెంట్ కంపెనీకి చెందిన పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని వీధి వ్యాపారులకు నేరేడుచర్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత లయన్ కేవీ ప్రసాద్ సహకారంతో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, కొణతం సీతారాంరెడ్డి, బట్టు మధు, యడవల్లి సత్యనారాయణరెడ్డి, గుండా సత్యనారాయణ, కర్రి సూర్యనారాయణరెడ్డి, రంగారెడ్డి, ఆదిరెడ్డి, రామకృష్ణ, సైదులు, కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో ఘనంగా సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్ -5లో శుక్రవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై సూచనలు చేశారు. కాగా, దాతలు బాచుమంచి కొండయ్య అనంతలక్ష్మి దంపతుల సహకారంతో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోమమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ కారింగుల విజయ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ ఎంపీ టికెట్‌కు నాగన్నగౌడ్ దరఖాస్తు



గాంధీ భవన్‌లో దరఖాస్తు పత్రం అందజేస్తున్న ఎరగాని నాగన్న

హుజూర్‌నగర్ : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నల్గొండ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు హుజూర్‌నగర్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ శుక్రవారం గాంధీ భవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో నల్గొండ పార్లమెంట్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు ఈడ్పుగంటి సుబ్బారావు ఉన్నారు.

గిరిజనులను నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్

మఠంపల్లి : కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు కేవలం రూ. 13 వేల కోట్లు కేటాయించి ప్రభుత్వం తీవ్రంగా నిరాశ పర్చిందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్ విమర్శించారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్టికల్ 275 ప్రకారం గిరిజనులకు కేటాయించాల్సిన నిధులను సైతం తగ్గించడం అన్యాయమన్నారు. 2022- 23 బడ్జెట్‌లో ప్రధానమంత్రి పీవీటీజీల అభివృద్ధి మిషన్ పేరుతో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన రూ.15వేల కోట్లు, ఎస్టీ అభివృద్ధి యాక్షన్ ప్లాన్ పేరిట మరో రూ.లక్షా 17వేల కోట్లు గత రెండు ఏళ్లుగా ఖర్చు చేయకపోవడం గిరిజనుల పట్ల కేంద్రానికి ఉన్న చిత్త శుద్ధిని తెలియజేస్తుందన్నారు. సంఘం నాయకులు వినోద్, నాగేశ్వరరావు, శంభయ్య పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు బాధ్యతల స్వీకరణ

మునగాల : గత నెల 31తో గ్రామపంచాయతీల పాలకవర్గ పదవీకాలం పూర్తవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిగా మండలానికి చెందిన గెజిటెడ్ అధికారులను గురువారం రాత్రి నియమించింది. శుక్రవారం ప్రత్యేక అధికారులు పదవీ బాధ్యతలు చేపట్టారు. మునగాల, నారాయణగూడెం గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారిగా తహసీల్దార్‌వలిగొండ అంజనేయులు, బరాఖత్‌గూడెం, కృష్ణానగర్ గ్రామాల ప్రత్యేక అధికారులుగా ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. మిగతా 20 గ్రామాల్లో కూడా ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావడంతో ఆయా గ్రామాలకు సర్పంచ్‌ల స్థానంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం వారు జీపీ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. చిలుకూరు, సీతారాంపురం గ్రామాలకు ఎంపీడీఓ ఈదయ్య, బేతవోలు, పోలేనిగూడెం గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం గ్రామాలకు మిషన్ భగీరథ ఏఈ సిద్ధార్థ, ఆర్లెగూడెం, రామ్‌చంద్రానగర్ గ్రామాలకు మండల వ్యవసాయాధికారి శ్రీధర్, దూదియాతండా, జానకీనగర్ గ్రామాలకు ఎన్నెస్పీ ఏఈఈ మానస, జెర్రిపోతులగూడెం, కొమ్ముబండ తండా గ్రామాలకు పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మారెడ్డి, కొండాపురం, మాధవగూడెం గ్రామాలకు ఎంపీఓ ఇబ్రహింకలీల్, నారాయణపురం, సీత్లాతండా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, రామాపురంనకు పశువైద్యాధికారి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు మండలంలో..

పాలకవీడు : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం గురువారంతో ముగియడంతో పాలకవీడు మండలంలోని 22 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను కేటాయించారు. దీంతో శుక్రవారం ఆయా గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. రావిపహాడ్ గ్రామంలో ఎంపీఓ దయాకర్ బాధ్యతలు స్వీకరించారు.

నేరేడుచర్ల మండలంలో..

నేరేడుచర్ల : గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు కార్యదర్శులతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు నీరు, పారిశుధ్య సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు.



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్న గ్రామ పంచాయతీలో బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సైదులు



చిలుకూరు : బేతవోలులో బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ

మఠంపల్లి మండలంలో..

మఠంపల్లి : గ్రామ పంచాయతీల సర్పంచ్, పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశానుసారం మఠంపల్లి మండలంలోని గ్రామ పంచాయతీలలో శుక్రవారం మండల స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెదవీడులో ఎంపీడీఓ జానకిరాములు, అవిరేణికుంటతండాలో తహసీల్దార్ మంగా, మట్టపల్లిలో ఎంపీఓ అంజనేయులుతో పాటు అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశాల మేరకు గురువారం నడిగూడెం మండలంలోని 15 గ్రామాలకు ప్రత్యేక అధికారులు విధుల్లో చేరారు. నడిగూడెం, బృందావనపురం గ్రామాలకు ప్రత్యేక అధికారిగా గ్రిడ్ ఏఈ బి.అనిల్ నాయక్, శ్రీరంగాపురం, చాకిరాల గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.ఇర్ఫాన్, వల్లాపురంనకు ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు, రామాపురం, రత్నవరంలకు తహసీల్దార్ ఎం.హేమామాలిని, సిరిపురం, నారాయణపురం గ్రామాలకు ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్ హుస్సేన్, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం మండల పశువైద్యాధికారి బి.అఖిల, కాగితరామచంద్రాపురం, కరివిరాల పశువైద్యాధికారి ఎం.రవికుమార్, తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు విధుల్లో చేరారు.

చింతలపాలెం మండలంలో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. కిష్టాపురం, రేబల్లెలకు సీహెచ్.నాగార్జున (ఏఈ, ఎస్డీ), శోభనాద్రిగూడెం, పాకలనాయక్‌తండాలకు కృష్ణయ్య (సీహెచ్‌ఓ), చింత్రియాల, వజినేపల్లిలకు కె.స్వామి (డీఈ, ఎస్‌డీ-4), దొండపాడు, పులిచింతల ప్రాజెక్టుకు కె.జగదీష్ కుమార్ (ఎంపీఓ), గుడిమల్కాపురం, గాంధీనగర్ తండాకు బి.మధు (పశువైద్యాధికారి), నక్కగూడెం, తమ్మారంనకు బి.రమేష్ (పశువైద్యాధికారి), యర్రకుంటతండాలకు కొత్తగూడెం సైదానాయక్ (మండల విద్యాధికారి) ప్రత్యేక అధికారులుగా విధుల్లో చేరారు.

మోతె మండల ప్రత్యేక అధికారులు వీరే

మోతె : గ్రామ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరికొండ, రావిపహాడ్, అప్పన్నగూడెం గ్రామాలకు హరిసింగ్‌నాయక్ (ఎంపీడీఓ), నామవరం, విభళాపురం, మామిళ్లగూడెం గ్రామాలకు ప్రకాష్‌రావు (తహసీల్దార్), కూడలి, రావికుంటతండా, నర్సింహాపురం గ్రామాలకు గోపాల్‌రావు (ఎంఈఓ), మోతె, హుస్సేన్‌బాద్ గ్రామాలకు అరుణ (ఏఓ), రాంపురంతండా, కరక్కాయలగూడెం, సర్వారం గ్రామాలకు పీఆర్ ఏఈ రంగారావు, తుమ్మగూడెం, గోపతండాడ, నేరడవాయి గ్రామాలకు ఏఈ మణికంఠ, బుర్కచర్ల, గోల్‌తండా గ్రామాలకు పి.లింగయ్య (ఐబీ ఏఈ), లాల్‌తండా, భోజ్లతండా, బీక్యతండా గ్రామాలకు ఏఎస్‌ఓ శ్రీనివాసరెడ్డి, ఉర్లుగొండ, బోడబండ్లగూడెం, అన్నారిగూడెం గ్రామాలకు డీటీ పూరయ్య, రాఘవాపురం, రాఘవాపురం ఎక్స్ రోడ్డు, తుమ్మలపల్లి, కొత్తగూడెం గ్రామాలకు వెంకటాచారి సూపరిటెండెంట్‌లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ మండల ప్రత్యేకాధికారులు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పాలన గడువు ముగియడంతో శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. అమరవరం, లింగగిరిలకు ఎంపీడీఓ లావణ్య, అంజలీపురం, శ్రీనివాసపురంలకు ఏఈ శ్యామల, బూరుగడ్డ, కరక్కాయలగూడెంలకు ఏఈ శ్రీనివాస్, గోపాలపురం, మర్రిగూడెంలకు డీటీ కమలాకర్, లక్కవరం, వేపలసింగారంలకు వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, సీతారాంపురంనకు ఏఓ స్వర్ణలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియమించారు.

సాగు నీటిపై స్పందించపోవడం అన్యాయం

● మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్యయాదవ్

కోదాడ : చేతికొచ్చే దశలో ఉన్న పొలాలు ఎండిపోయి జిల్లా రైతాంగం తీవ్ర ఇబ్బంది పడుతుంటే ఇక్కడి పంటలకు నీరివ్వకుండా సాగర్ నీటిని ఖమ్మం జిల్లాకు తరలించుకుపోతుంటే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవడం అన్యాయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం కోదాడ బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకొని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేద్దామని కోరారు. ఈ నెల 4న కోదాడలోని గుడుగంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న కోదాడ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

సబ్ కోర్టు మంజూరుపై హర్షం



స్వీట్లు తినిపించుకుంటున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కోదాడఅర్బన్ : కోదాడకు సబ్ కోర్టు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తులు శ్యాంసుందర్, భవ్యలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు నాగార్జున మాట్లాడుతూ సబ్ కోర్టు ఏర్పాటుకు గత 15 సంవత్సరాలుగా న్యాయవాదులు చేస్తున్న కృషి ఫలించిందని తెలిపారు. రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల కల సాకారం అయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి, హైకోర్టు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి శరత్‌బాబు, న్యాయవాదులు రాధాకృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి, యశ్వంత్, కృష్ణయ్య, శ్రీనివాస్ సీతారామరాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా వికలాంగులకు ప్రత్యేక చట్టం తేవాలి



మండల కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న వికలాంగులు

గరిడేపల్లి: మహిళా వికలాంగుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సూర్యాపేటలో వికలాంగులాలిపై ఓ పోలీస్ కానిస్టేబుల్ అసభ్యంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ గురువారం రాత్రి గరిడేపల్లి మండల కేంద్రంలో కోదాడ -మిర్యాలగూడ రహదారిపై కొవ్వొత్తులు వెలిగించి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగుల మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు దాడులు అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుర్ర గోపి యాదవ్, ఈదయ్య, గుర్రం నరేష్‌రెడ్డి, మధు, శేఖర్‌రెడ్డి, నాగమణి, గుంటి శివకుమార్, గంగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మనస్ఫూర్తిగా' వెబ్ మువీ పాటలు విడుదల



వెబ్ మూవీ పాటలు విడుదల చేస్తున్న టీపీసీసీ డెలిగేట్ సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి

కోదాడఅర్బన్ : దేశానికి అన్నం పెట్టే రైతుల సమస్యలు ప్రజలందరికీ అర్థమయ్యేలా వెబ్ సినిమాను నిర్మించడం అభినందనీయమని టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని ఆయన నివాసంలో మనస్ఫూర్తిగా వెబ్ సినిమా పాటలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన కళాకారులు సందేశాత్మకమైన చిత్రాలను నిర్మిస్తూ ప్రజలందరీ ఆదరాభిమానాలు పొందడం పట్ల చిత్ర బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, పట్టణ యూత్ అధ్యక్షుడు డేగ శ్రీధర్, కొండల్‌రెడ్డి, రజనీకాంత్, నటీనటులు సంపేట వెంకట్, కండిబండ ఉపేందర్‌రావు, కన్నెబోయిన సత్యనారాయణ, దేవరకొండ రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ అమలవుతాయి



ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పాలకవీడు : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ అమలవుతుందని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్, ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, ఎంపీఓ దయాకర్, నాయకులు మాజీ సర్పంచ్‌లు బూషిపల్లి వెంకట్‌రెడ్డి, పట్లూరి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్‌రెడ్డి, నీమానాయక్, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామంజిరెడ్డి, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి



కోదాడఅర్బన్ : ఎంఈఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న ముత్యాలు, కార్మికులు

కోదాడఅర్బన్ : ఈ నెల 16న దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో యావత్ కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడలోని హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ ఎంఈఓ ఎండి సలీంషరీఫ్‌కు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం అధ్యక్షురాలు గురజాల తిరుపతమ్మ, సైదమ్మ, బుజ్జి, రోజనమ్మ, శారద, చిట్టెమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

మఠంపల్లి : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న అఖిల పక్ష కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రస్‌మియా కోరారు. శుక్రవారం మఠంపల్లిలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక మహిళలతో కలిసి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంకు సమ్మె నోటీట్ అందజేశారు. కార్యక్రమంలో గోవిందమ్మ, మంగమ్మ, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మామిడి జానకిరాములు కేక్ కట్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న సిబ్బంది, ఉద్యోగులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీఏలు సక్రు, నరసింహ, బుంగయ్య, సీఓ అఫ్జల్, రమాదేవి, ఎఫ్‌ఏలు బిచ్చు, గోపయ్య, భిక్షం, నాగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మునగాల : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను విధిగా పాటించాలని స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా ఎస్‌ఐ లోకేష్ మాట్లాడుతూ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బంది. ఆటో డ్రైవర్లు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

అరుదైన చేప లభ్యం



మునగాల : మండల కేంద్రం శివారులో గల సాగర్ ఎడమ కాలువ ప్రధాన రెగ్యులేటర్ వద్ద శుక్రవారం ఓ యువకుడికి అరుదైన చేప లభించింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వత్సవాయి అనిల్‌గౌడ్ కాలువలో చేపల వేట సాగిస్తుండగా వింత చేప లభ్యమైంది. దీంతో మండల కేంద్రానికి చెందిన సీనియర్ జంతు శాస్త్ర అధ్యాపకుడు గాయం శ్రీనివాసరెడ్డి ఆ చేపను పరిశీలించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ చేపను సాధారణంగా రాకాసి చేప, డెవిల్ ఫిష్, దయ్యం చేప, బల్లి చేప, సక్కర్ మౌట్ క్యాట్ ఫిష్, అమెజాన్ సైల్ఫిన్ క్యాట్ ఫిష్ అనే పేర్లతో పిలుస్తారన్నారు. ఇది దక్షిణ అమెరికాలోని అమెజాన్ నదిలో మాత్రమే లభిస్తుందని, ఇది ప్రస్తుతం కృష్ణ, గోదావరి నదిలోకి వలస వచ్చి ఉంటుందని, ఇది ఒకవేళ చెరువుల్లోకి చేరితే మిగతా చేపలను తినేస్తుందని వివరించారు.

వైవిరెడ్డి సేవలు మరువలేనివి



వైవిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కోదాడ : విద్యావేత్తగా, మానవతావాదిగా వైవిరెడ్డి కోదాడ ప్రాంతంలో చేసిన సేవలు మరువలేనివని పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, సీఈఓ ఎస్ఎస్.రావు అన్నారు. శుక్రవారం కోదాడలో ఎంఎస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ దివంగత వైవిరెడ్డి 7వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో త్వరలో కోదాడలో వైవిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు గంగాధర్‌రావు, ప్రసాద్, శ్రీనివాస్, గోపి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో అందించాలన్నారు.

ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయికులు

మునగాల : సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలు నింపి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన జిల్లా మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు శుక్రవారం మండలంలోని గణపవరం శివారులో గల ఎడమ కాలువ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమరబోయిన మట్టయ్యయాదవ్, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, పచ్చిపాల శ్రీనివాస్, సూరేపల్లి రమేష్, మేడం బొబ్బిలి, కేతిరెడ్డి మట్టారెడ్డి, పల్లె పిచ్చయ్య, నెమ్మాది సైదులు, సారెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా గ్రామంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలో నల్లగొండ ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేసిన రూ.6 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైయినేజీ నిర్మాణ పనులను శుక్రవారం మఠంపల్లి మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం చుట్టూ, పరిసర ప్రాంతం అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ దారావత్ శౌరీనాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మోతీలాల్, పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాముడునాయక్,బోజ్యానాయక్, బాలునాయక్, నాగేశ్వరరావు, తావుర్యా, భీలానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ మీటర్లకు ఫోన్ నంబర్లు లింక్ చేయించాలి

నేరేడుచర్ల : విద్యుత్ వినియోగదారులు ఎలక్ట్రికల్ మీటర్ సర్వీస్ (కరెంట్ మీటర్లు)కు ఫోన్ నంబర్లు లింక్ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఫోన్ నంబర్లు లింక్ చేసుకోవడంతో విద్యుత్ బిల్లు వివరాలు, పవర్ కట్ నిలిపివేత సమయం, తదితది సమాచారం ఫోన్‌లకు మెస్సేజ్ ద్వారా అందుతుందని ఆయన తెలిపారు.

సర్వారం చెరువును నింపాలి

గరిడేపల్లి : మండలంలోని సర్వారం చెరువును సాగర్ నీటితో నింపాలని మాజీ ఎంపీపీ బీమపంగు సోమయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో చెరువు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి పోయాయని దీంతో గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లకు సన్మానం



సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మేళ్లచెరువు : పదవీ కాలం పూర్తయిన సందర్భంగా మేళ్లచెరువు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, జెడ్పీటీసీ పద్మ గోవిందరెడ్డి, ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, గోపిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మైహోం పరిశ్రమ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

మేళ్లచెరువు : మండలంలోని వేపలమాధవరంలో మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశ్రమ హెడ్ ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 250 గేదెలు, ఆవులు, 2300 గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులు, కోళ్లకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలరాజు, కొండల్‌రావు, డాక్టర్ ఉషారాణి, శ్రీనివాసరెడ్డి,ఎ పరిశ్రమ జీఎం నాగేశ్వరరావు, జగన్నాథరావు, రత్నం, ఏజీఎం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



చిమిర్యాలోని వేదాద్రి పేపర్ ప్లాంటును సందర్శిస్తున్న ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులు

కోదాడఅర్బన్ : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలలోని ఐదో తరగతి విద్యార్థులు శుక్రవారం చిమిర్యాలలోని వేదాద్రి పేపర్ మిల్లును సందర్శించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా పేపర్ తయారీకి ఉపయోగించే ముడి సరుకుల వివరాలు, సందేహాలను, తయారీ విధానాన్ని పేపర్ మిల్లు యాజమాన్యాన్ని, టెక్నీషియన్లను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు జయవాణీదేవి అన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాల్లో హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి తూరుపాటి రామ్‌మురారి పాల్గొని తిరుమలరాయ పాత్రను పోషించి అద్భుతంగా ప్రదర్శించినందుకు బాలరత్న -2023 అంతర్జాతీయ పురస్కారం పొందాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని శుక్రవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.